ఏవో పెద్దపెద్ద మాటలతో - భాష పెరగాలి, సారస్వతం రావాలి అంటే రాదు — అందుకు తగిన పరిస్థితులు కల్పించాలి. ఇంగ్లీషుతో కావలసినంత విజ్ఞానం పెంపొందించవచ్చును.

ఒక్క విషయంలో పరిశోధించి పుస్తకం రాయాలంటే ఆ మనిషి తిండితిప్పల సంగతి చూడకుండా నడవదు. అందుకు తగిన ప్రతిఫలంకోసం కాదు - ఆ రాతకోసం బతకడానికే నేనంటున్నది - ఆదరువుండాలి.

బాగా ప్రచురితమయ్యేవరకూ, విజ్ఞానానికీ సాహిత్య విమర్శకూ చరిత్రాది విమర్శలకూ సంబంధించిన పుస్తకాలను ఏమాత్రం విలువైన పరిశోధన ద్వారా వెలువడినవన్నా ప్రభుత్వం ప్రచురిస్తే చాలు—బోలెడు గ్రంథాలు రా వీలున్నది. రచయితలూ బతికే వీలున్నది.

ఇక మిగతవాటి సంగతేమిటి? కథలు, కావ్యాలు, నవలలు, నాటకాలు పూర్వంలా రాలేదేమిటి? అని పెదవి విరిస్తే అది వాదం కాదు. ఇప్పుడూ వస్తూనే వున్నాయి.

మనిషి బతుకుతూనే వున్నాడు. పుట్టుక జరుగుతూనే వున్నది. ఆత్మహత్యలు పత్రికల్లో వారానికి నాలుగు రోజులు పడుతూనే వున్నవి.

రచయితల్లు రాస్తూనే వున్నారు అన్నంకోసం అలమటిస్తూనే. అవేవో నూటికో కోటికో అచ్చు అవుతూనూ వున్నవి! అనో్న యిన్నో ఖర్చు అవుతూనూ వున్నవి.

కాని యిది బతుకా? ఇది రచనా? ఇది దేశమా? ఇది సాహిత్య కళాపోషణమా? కుర్చీలూ, బల్లలూ, రేడియో, టీపాయీ ఇవే కాదు-అసలు పుస్తకాల బీరువాకూడా ఇంట్లో వుండాలన్న పరిజ్ఞానం సంపన్నులలో నైనా కలగాలి.

ఇక బతుకే గుదిబండగావున్న సామాన్యపు జనమే మేలనిపిస్తుంది. వారు కనీసం యేవో తమదృష్టిలో అవసరమనుకున్న వానినైనా తప్పకుండా కొంటారు. చదువుతారు. పైవారిది మరీ అన్యాయం. రూపాయపావలా సినీమా టిక్కెట్టు కొనేవాడు రూపాయి పుస్తకం నెలకొకటి కొనడంలేదు.

ఇవన్నీ బాగుపడాలి. ఏదో యీ పాడు సమాజవ్యవస్థలో అన్నిటికీ ఆశించలేమనేది వేరే సంగతి. కాని "కనీసం" అనే దొకటైనా అందుకోకపోతే యెందుకూ నీతులూ, ఉపదేశాలూ? కనుదుడుపులతో కడుపు నిండదు.

—విశ్వం

---

స్కెచ్

# బ్రతుకు జీవుడా!

"కృష్ణమూర్తి"

ఇంకా సూర్యోదయం కాలేదు. నేనూ, శాస్త్రీ, చంద్రుడూ, కోమలవిలాస్‌కి బయల్దేరాము. "నేను టిఫిన్ తినేసి సోమవారం వుంటా"నన్నాడు చంద్రుడు. "కుటుంబరావుగారు కూడా అలాంటి ఉపవాసమే వుంటారు. మనము తిరిగి వచ్చేసరికి డబ్బాలోని కోవా బిళ్ళలు మాయమవకపోతే చూద్దాము" అన్నాడు శాస్త్రీ. సందు మళ్ళేము. కొత్త రోడ్డు మొగని జనము ఎందుకో గుమికూడారు. నేను ఇద్దరి బుజాలమీదినించి తొంగిచూశాను. ఒక కాపుమనిషి ఒళ్ళో తాటాకు బుట్టా, ఆ బుట్టలో ఒక పసి కందువూను. "ఏ అమ్మ కన్నదో పాపం బిడ్డముక్కని పారేసినట్టు సైడు కాలవలో పారేసింది" అంది ఒక చూపరి. "పారేయలేదమ్మా, మెత్తగా గుడ్డలు పెట్టి ఎవరేనా తీసుకుపోయి పెంచుకోవాలని అదిగో ఆ రాయిమీద పెట్టింది" అంది ఒళ్లో పెట్టుకున్న కాపుమనిషి. ఇంతలో శాస్త్రీ, చంద్రుడూ జనాన్ని తప్పించుకుని ముందుకు వచ్చారు. వారంతా పాటక జనమూ, చొక్కాలూ, చెప్పులూ తొడుక్కున్నామని కాబోలు మాకు దారి యిచ్చేశారు. "బాబూ, ఈ పాపని ఎవ్వరో ఒగ్గేసినారు. ఆయమ్మ పెంచుకుంటనంటది. తీసుకుపోకూడదు బాబూ"

అన్నాడొక పెద్దకూలి. "తప్పుతప్పు. పోలీసుకి తెలిస్తే పీకమీదకి వస్తుంది" అన్నాను.

"బాబూ పెంచుకుంటామన్నా తప్పేనా?" ఇటూ అటూ చూశాను. పాటకపు జనము తప్ప "పెద్ద" మనుష్యులెవ్వరూ లేరు. మెల్లిగా అన్నాను: "నీ తెలివి తక్కువగానీ, చూడగానే ఏమీ ఎరగనట్టు బుట్టతో పట్టుకు పోయి ఉంటే ఏ గొడవా వుండకపోను. ఇప్పుడు నలుగురికీ తెలిసి వెల్లడైపోయాక నువ్వు పట్టుకుపోతే పోలీసులు ఎవరా మనిషి, ఏమి హక్కుందని తీసుకుపోతుందీ? అని ఆరాలు తీస్తారు. నీఅదృష్టము బాగుండక ఈ గుడ్డు గుటుక్కుమంటే కూనీలూ గీనీలూ!" "బాబూ అయితే నాకెందుకల్లరి. నా మానాన్ని నేను పోతాను. ఎందుకొచ్చినదీ ఈ చిక్కులన్నీ. ఏదో బిడ్డని భగవంతుడిచ్చినాడు. పెంచుకుందామని ఆశపడ్డాను. నేను ఒళ్లో పెట్టుకు కూచోకపోతే ఏ కుక్కలో ఈపాటికి పీకేసి వుండును" అంది కాపుమనిషి. "నీకు మెల్లిగా చెప్తే తెలీడము లేదు. నీ యిష్టము వచ్చినట్టు చేసుకో మాకేమి మధ్యనీ?" అని వెనక్కి తిరిగేను. గుంపుదాటి వడ్డాది వారింటిదాకా వెళ్ళేసరికి కాన్వెంటు బస్సు విసురుగా మా కుడిపక్కనించి వెళ్ళిపోయింది. బస్సు నిండా ఆడపిల్లలు బిలబిల లాడుతున్నారు. "అదుగో యిలాగ దొరికినవాళ్లే వాళ్ళంతా. పట్టి తీసికెళ్ళి నన్నులుగా తయారుచేస్తున్నారు మిషనరీలు" అన్నాడు చంద్రుడు. నేనింకా ప్రకృతిలో పడలేదు. "ఛఛా, అలాగ అనడానికి వీలు లేదు. అందరూ అలాటివాళ్ళేనని యెలాగంటావు" అన్నాడు శాస్త్రి. "కాకపోతే ఆ వయసులోని పిల్లలు వీళ్ళకి ఎలాగ దొరుకుతారూ? వాళ్ళంతా వైరాగ్యం వచ్చేసినవాళ్ళేనేమిటి?" అన్నాడు చంద్రుడు. నేను వారి వాదములో దిగలేదు. మిషనరీలు చూస్తే మట్టుకు ఆపిల్ల ఆ కాపుమనిషికి దక్కదనే వూహే వుంది నా మనస్సులో. అమాటతే అన్నాను.


కోమలవిలాస్‌కి వెళ్ళనూ వెళ్ళాము, ఇడ్డెన్లూ దోసె తినానూ తిన్నాము. కాని నా భయమంతా ఆ పసికందుని మిషనరీలు పట్టుకుపోతారనే. "ఏ దౌర్భాగ్యురాలో వైధవ్య బాధ అనుభవించలేక కక్కుర్తిపడి ఆ బిడ్డని కని పారేసింది. దానికి పుట్టిన పాపంవల్ల ఈ పసిగుడ్డుకి కూడా బతుకంతా అలాంటి నరకమే అయిపోతుంది." అనే ఊహ మబ్బులాగ కమ్మేసింది మనస్సంతా.

తిరిగి వచ్చేటప్పటికి జనమెవ్వరూ ఆ తూము దగ్గర లేరు. అక్కడ పెసరట్లు వేసే ముసిలమ్మని "ఏమమ్మా, ఆ కాపమనిషి ఆ పిల్లని తీసికెళ్ళి పోయిందా?" అని అడిగేను. "లేదు బాబూ పోలీసులు వచ్చి అందర్నీ తీసుకుపోయినారు" అన్నది. మాట్లాడకుండా మాలాడ్జికి వెళ్ళి పోయాము.

మాశాస్త్రి తెలివైనవాడు. "ఏం కృష్ణమూర్తీ! ఇంకా ఏదో ఆలోచిస్తునేవున్నావు"


శాస్త్రీస్ హోటల్

చికపేట్,
బెంగుళూరు సిటీ




అనుపమానమైన హోటల్!
సుఖవంతమైన, హాయినిచ్చేవసతిగదులు-
రుచివంతమైన వంటలు : అణకువతో
శ్రద్ధగా మెలిగే పనివాళ్లు

అన్నాడు. "ఏంలేదూ. ఏ దౌర్భాగ్యురాలో కక్కూరిపడి విధిలేక ఆ పిల్లని కని పారేసింది. వ్యభిచారానికి పుట్టిన ఆ పిల్ల మిషనరీలకి దొరికితే దాని బతుకూ తల్లి బతుకులాగే నడుస్తుంది. చిత్రం కాదూ?" అన్నాను. నా మొహంకేసి అదోలా చూసి, "అవును. ఆ మాట నిజమే. అదా అలా ఆలోచిస్తున్నావూ. కాని ఆ పిల్ల బతకడము కష్టము. ఏ తెల్లవారగట్లో అక్కడ పారేసి వుంటారు. ఇంతకాలము గాలి పట్టి పోయిన గుడ్డు ఎంతసేపు బతికేనీ?" అన్నాడు శాస్త్రి. నిజమే అనుకున్నాను. బలవంత బ్రహ్మచర్యము అనుభవించడము కంటె ఇంతప్పుడే చావడమూ మేలు" అనిపించింది. మళ్ళీ ఆ పిల్ల మీదికిపోయింది మనస్సు. "ఈ కాపు మనిషి ఆ పిల్లని రక్షించింది కనక ఆ పిల్లని ఈ కాపు మనిషికే ఇవ్వండి. మిషనరీలకిస్తే దాని బతుకూ తల్లి బతుకులాగే నడుస్తుంది" అని పోలీసు ఇన్స్పెక్టరుకి చెప్తే? అతనూ చదువుకున్నవాడే కనక ఈ ఊహ చెప్తే కాస్త ఆలోచించక పోడు అనుకుని, శాస్త్రితో చెప్పకుండానే బయల్దేరాను. కాని అతను నే నేదో పూనుకున్నానని గ్రహించాడు గాబోలు నేను సందు మళ్ళుతూ ఉండగా "జాగర్త" అన్నాడు. "మధ్య నాకెందుకూ జాగర్తా" అని తిరిగి పోయాను.

పోలీసు స్టేషనులో అరుగుమీద బల్లా కుర్చీ వేసుకుని ఇన్స్పెక్టరు కాబోలు కూర్చున్నాడు. జనము ఎవరో బయటికి వచ్చేస్తున్నారు. లోపలికి వెళ్ళి "గుడ్ మార్నింగ్" అన్నాను. అందుకుని కూర్చోమని సైగచేశాడు. కూర్చుని చెప్పాను. "అవునండీ ఆ మాట నిజమే. వీలైతే ఆ కాపుమనిషికే ఇప్పించేస్తాము. ఆ పిల్లని హాస్పిటల్లో ఆర్. యం. ఓ. దగ్గిరకి పంపించాం" అన్నాడు. "ఆహాఁ, సరే ఏదో ఆ ఊహ తట్టి మీకు చెప్దామని వచ్చాను శలవు" అని లేచాను. "చూడండీ! మీ లాడ్జి ఎక్కడన్నారూ?" అన్నాడు. "ఎర్రమిల్లివారి మేడ మీద" అన్నాను. "మీరు కొంచెం వాకబు చెయ్యండి. ఇలాంటి క్రైమ్సు (నేరాలు) జరగకూడదు. చూడండి పాపం ఆపిల్ల నలా పారేశారు. ఎవరో తెలిస్తే కబురు చెయ్యండి" అన్నాడు. తిరిగి వచ్చేస్తూ ఇన్స్పెక్టరుగారు పెట్టిన కొత్త పనికి చాలా సంతోషిస్తూ "నేను చెప్పేదొకటీ, ఈయనగారు చూసేది మరొకటీని. ఆ శిశువు గొడవ ఎవడికీ అక్కర్లేదు" అనుకున్నాను.

"అయినా ఆర్. ఎమ్. ఓ. దగ్గిరకి కూడా వెళ్తేనో?" అనిపించింది. తొమ్మిది అయింది కాబోలు కాలేజీ బస్సు వస్తోంది. గబగబా పరిగెత్తి స్టాపంగు దగ్గిర పట్టుకున్నాను. హాస్పిటలు పక్కనించి వెళుతున్నప్పుడు పనివుందని రాఘవయ్యగారితో చెప్పి దిగిపోయాను.

ఆర్. ఎమ్. ఓ. ఇంటి అరుగుమీదే బెంచీ వుంది. బంట్రోతునడిగితే "భోయనానికి కూకున్నాను బాబూ" అన్నాడు. నేను బెంచీమీద కూర్చున్నాను. ఒక అరగంట పైగా అయి వుంటుంది. ఆయన ఇంకా భోజనం ముగించి రాలేదు. శాస్త్రీ చంద్రుడూ కాఫీహోటలుకి కాబోలు వెళ్తూ నన్ను చూసి ఆగేరు. శాస్త్రి చేతితో సైగచేసి పిలిచాడు. వెళ్ళాను. "ఏం ఇక్కడికి వచ్చావూ" అన్నాడు. చెప్పాను. చంద్రుడు నవ్వుతూ, "నేనువుంటూ నన్నట్టు గానే వుంటున్నావే కార్తీక సోమవారము నువ్వూ" అన్నాడు. శాస్త్రి 'మాట' అని హాస్పిటలు గోడ అవతలికి వెళ్ళాక, గట్టిగా రహస్యము చెపుతున్నట్టు "అవును గానీ, పొద్దుటినుంచి ఒక్క వరసని తిరుగుతున్నావు ఆ పిల్లకోసము. ఎవరికీ లేని నీకెందుకు పట్టిందీ. ఆ పిల్లకీ నీకూ ఏమిటి సంబంధమూ? ఈమాట ఎవరూ అడగలేమూ? ఆర్. ఎమ్. ఓ. అడుగుతాడులే" అన్నాడు. నా ప్రాణాలెగిరి పోయాయి. "అమ్మనాయనో యెంత తెలివి తక్కువ పని చేస్తున్నానూ" అన్నాను. శాస్త్రి మళ్ళీ అందుకున్నాడు: "పదింపావు అయ్యింది. రిక్షా చేసుకుని లాడ్జికెళ్ళు. కుటుంబరావుగారు మిగిల్చివుంటే కోవా బిళ్ళలు తినేసి ఆఖరి బస్సుమీద కాలేజీకి వెళ్ళు. అవి అయిపోయి వుంటే కార్తీక సోమవారం చేశేయి మిగిలన ఫలం కూడా దక్కుతుంది!" నాకీ మాటలు అప్పుడు వినబడనే లేదు. రిక్షా ఎక్కుతూ "బ్రతుకు జీవుడా" అన్నాను.